సాక్షి అనంతపురం

శనివారం । 26 । ఏప్రిల్ । 2025



టన్ను చీనీ రూ.21 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.21 వేలు ప్రకారం ధర పలికాయి.



న్యాక్ దక్కేనా?

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం న్యాక్ పరీక్షకు సన్నద్ధమవుతోంది. మెరుగైన పాయింట్లు సాధించేందుకు ఉన్నతాధికారులు కృషి చేస్తున్నారు. 10లో

గరిష్టం/కనిష్టం

41.7°/24.3°

జిల్లాలో శుక్రవారం గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వేసవితాపం అధికంగా కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

సజావుగా సర్టిఫికెట్ల పునః పరిశీలన



ఆర్థోకు సంబంధించి సర్టిఫికెట్ రీ వెరిఫికేషన్ చేస్తున్న డాక్టర్ ఆత్మారాం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఉపాధ్యాయుల మెడికల్ సర్టిఫికేషన్ రీ వెరిఫికేషన్ ప్రక్రియ శుక్రవారం సజావుగా సాగింది. శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. ఆస్పత్రిలోని డీఈఐసీ, బర్న్స్ వార్డు, ఆప్తాల్మిక్ వార్డుల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరిగింది. ఆర్థో హెచ్‌ఓడీ, ప్రొఫెసర్ డాక్టర్ ఆత్మారాం, వైద్యులు డాక్టర్ ఆనంద్ బాబూ నాయక్, డాక్టర్ ప్రశాంతి, తదితరులు సర్టిఫికెట్లను పరిశీలించారు.

నలుగురు విద్యార్థుల డీబార్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ, బీఈడీ పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతున్న నలుగురు విద్యార్థులను డీబార్ చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ జీవీ రమణ తెలిపారు. అనంతపురం, తాడిపత్రిలో ఒక్కొక్కరు చొప్పున డిగ్రీ విద్యార్థి, తాడిపత్రిలో ఇద్దరు బీఈడీ విద్యార్థులపై చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

మే 5న జాతీయ లోక్ అదాలత్

అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అన్ని కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి మే 5న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ.భీమారావు, జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి ఈ. శివప్రసాద్ యాదవ్ తెలిపారు. అలాగే అనంతపురం జిల్లా కోర్టు పరిధిలోని కేసుల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రోడ్డు ప్రమాదం కేసులు, సివిల్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, కుటుంబ తగాదాల (విడాకుల కేసులు కాకుండా) , పారిశ్రామిక వివాదాలు, రాజీ చేయదగ్గ క్రిమినల్ కేసులు, వినియోగదారుల ఫోరం కేసులు, ప్రిలిటిగేషన్ తదితర కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేస్తామన్నారు. కక్షిదారులందరూ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



విజేత కప్‌ను అందుకుంటున్న ఏపీఎస్పీ 14వ బెటాలియన్ సిబ్బంది

బుక్కరాయసముద్రం: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. కర్నూలు జిల్లా రెండవ బెటాలియన్ ఎస్‌ఏపీ క్యాంప్‌లో ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ సిబ్బందికి రేంజ్‌ల వారీగా క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న జిల్లా ఏపీఎస్పీ 14వ బెటాలియన్ జట్టు బాస్కెట్ బాల్, క్రికెట్ పోటీల్లో విజయం సాధించింది. పోటీల ముగింపు సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేత జట్టుకు ట్రోఫీలను ప్రవీణ్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానసిక ఒత్తిడి తగ్గించుకునేందుకు క్రీడలు ఎంతో ఉపయోగమన్నారు. కార్యక్రమంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ కేశవరెడ్డి, మహబూబ్ బాషా బెటాలియన్ ఉద్యోగుల సంఘం నాయకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నరకయాతన

◆ ఇక్కడ చికిత్స పొందుతున్న వ్యక్తి పేరు రజాక్. వీరిది అనంతపురం రూరల్ పరిధిలోని పాపంపేట. ఎనిమిది నెలలుగా లివర్ సమస్యతో బాధపడుతున్నాడు. ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో కుటుంబ సభ్యులు సర్వజనాస్పత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు రజాక్ ఆరోగ్యం క్షీణిస్తోందని అత్యవసర విభాగంలో అబ్జర్వేషన్‌లో ఉంచుతామని చెప్పారు. తీరా చూస్తే అక్కడ మంచాలు లేవు. అప్పటికే ఓ మంచంపై అనారోగ్యంతో ఓ మహిళ చికిత్స పొందుతోంది. అదే మంచంపై రజాక్‌కు కూడా చికిత్స చేయాల్సి వచ్చింది.



జిల్లాలోని అన్ని ఆస్పత్రుల్లో వేధిస్తున్న బెడ్ల కొరత

- ఒకే మంచంపై ఇద్దరు, ముగ్గురు రోగులకు వైద్యం
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న పేషెంట్లు, వారి బంధువులు
- అనంతపురం జీజీహెచ్‌లో పరిస్థితి మరీ దారుణం
- మందుల కొరతకు తోడు పడకలు లేని దుస్థితి
- ప్రజారోగ్యాన్ని గాలికొదిలేసిన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: జిల్లాలో వైద్యం దైన్యంగా మారింది. మందుల కొరతతో అల్లాడుతున్న రోగులకు ఇప్పుడు పడకల కొరత కూడా వేధిస్తోంది. ఇన్‌పేషెంట్లకు పడక దొరకాలంటే గగనమైపోయింది. ఒక పేషెంటు డిశ్చార్జి అయి తేగానీ మరొకరికి పడక అవకాశం దక్కే పరిస్థితి లేదు. వైద్యం ఖర్చులకు భయపడి ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లలేక.. ప్రభుత్వాస్పత్రిల్లో పెట్టించుకునే దిక్కులేక రోగులు నరకయాతన అనుభవిస్తున్నారు. వైరల్ జ్వరాలు, పాముకాటు కేసులు, పాలీ ట్రామా కేసులు ఒకటేమిటీ ఎవరి పడక కావాలన్నా యుద్ధం చేయాల్సిన పరిస్థితి.



బెడ్ల కొరతతో రాయదుర్గం ఏరియా ఆస్పత్రిలోని చిన్న పిల్లల వార్డు ఇలా..

ప్రమాద బాధితులకు చుక్కలు

జిల్లాలో జాతీయ రహదారి ఎక్కువగా ఉంది. అర్ధ రాత్రి సమయాల్లో ప్రమాదాలు కూడా ఎక్కువగా జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో ఎక్కువ మంది ప్రమాద బాధితులు అనంతపురం సర్వజనాస్పత్రికి వస్తుంటారు. అర్ధరాత్రి చావుబతుకుల మధ్య ఆస్పత్రికి వస్తే వారికి పడకలు ఉండవు. తెల్లవారు జాము సమయాల్లో వారికి ప్రాథమిక చికిత్స చేసే వారూ కరువే. కనీసం వారిని ఎమర్జెన్సీ రూముకు తీసుకెళ్లడానికి స్ట్రెచర్‌లు కూడా లేని దుస్థితి. క్యాజువాలిటీ వార్డులో కూడా ఒక్కో పడకలో ఇద్దరు లేదా ముగ్గురిని పడుకోబెడుతూ వైద్యం అందించాల్సిన పరిస్థితులు దాపురించాయి.

ఇబ్బందుల్లో బాలింతలు

జిల్లాలో ఏటా 45 వేల దాకా ప్రసవాలు జరుగుతున్నాయి. ఇందులో 70 శాతం ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే జరుగుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రులకు కాన్పులకు వచ్చే గర్భిణుల పరిస్థితి దారుణంగా ఉంది. పడకలు లేకపోవడంతో కాన్పు అయ్యాక బాలింతలను ఇద్దరిద్దరిని ఒకే మంచంపై పడుకోబెడుతున్నారు. అనంతపురంలోని సర్వజనాస్పత్రిలో అయితే పరిస్థితి మరీ దారుణంగా ఉంది. పట్టించుకునే దిక్కు లేదు. అంతకంతకూ జనాభా పెరుగుతోంది. రోగుల సంఖ్య రెట్టింపవుతున్నా పడకల సంఖ్య మాత్రం పెరగడం లేదు. ప్రభుత్వ ఆస్పత్రులంటేనే జనం బెంబేలెత్తిపోతున్నారు.

జిల్లాలోని ఆస్పత్రుల్లో నెలకు సగటున నమోదయ్యే ఔట్, ఇన్‌పేషెంట్ల వివరాలు

ఆస్పత్రి	పడకలు	ఔట్ పేషెంట్లు	ఇన్ పేషెంట్లు
రాయదుర్గం	100	17,179	1,269
తాడిపత్రి	100	18,672	1,091
గుంతకల్లు	100	19,030	1,831
కణేకల్లు	30	6,627	639
కొనకండ్ల	30	6,655	507
కళ్యాణదుర్గం	50	13,464	933
శింగనమల	30	5,662	215
ఉరవకొండ	50	12,428	620
గుత్తి	50	14,048	1,276
పామిడి	30	8,368	600
అనంతపురం	560	30,000	33,000

ఇలాగేనా వైద్యం అందించేది?



కూలి పనులు చేసి జీవనం సాగిస్తున్నాను. ఉన్నఫలంగా తీవ్ర జ్వరం, నీరసంగా ఉంటే పెద్దాస్పత్రిలో బాగా చూస్తారని వచ్చా. ఇక్కడ చూస్తే మంచాలు లేవు. ఒకే మంచంపై తలకిందులుగా పడుకోవాల్సి వస్తోంది. వేరొకరి కాళ్లు తగులుతున్నాయి. ఆమెకు నా కాళ్లు తగలకుండా జాగ్రత్త తీసుకోవాల్సిన దుస్థితి. ఇలాగేనా వైద్యం అందించేది. మాలాంటి పేదోళ్లకు ప్రభుత్వం వైద్యం కూడా సరిగా అందించకపోతే ఎలా?

– రామాంజినమ్మ, గుంతకల్లు



ఇక్కడ కన్పిస్తున్న వృద్ధులు జయలక్ష్మి (పల్లెన్నగారిపల్లి, సీకేపల్లి మండలం), వెంకటేశులు (సీకే పల్లి). వెంకటేశులు డయాలసిస్ పేషంట్. జయలక్ష్మి ఆయాసంతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరింది. వైద్యం కోసం వస్తే మంచాలు లేకపోవడంతో పడుకోవడానికి వీలు లేని పరిస్థితి. దీంతో ఇద్దరు ఆక్సిజన్ తీసుకుంటూ ఒకే మంచంపై ఇబ్బంది పడుతూనే చికిత్స తీసుకుంటున్నారు.

భవనాలు పూర్తికాలేదు

జిల్లాలోని వివిధ ఆస్పత్రుల్లో పడకల కొరత ఉన్నది వాస్తవమే. 'నాడు–నేడు' కింద భవనాలు పూర్తి కావాల్సి ఉంది. తాడిపత్రి, గుంతకల్లు ప్రాంతాల్లో పడకలు పెరిగేలా చర్యలు చేపట్టాం. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో అందుబాటులో ఉన్న పడకల్లో రోగులను అడ్మిట్ చేసుకొని సేవలందించాలని వైద్యులను ఆదేశించాం.

– డాక్టర్ పాల్ రవికుమార్, డీసీహెచ్ఎస్

పోలీసులను పరుగులు పెట్టించిన సెల్ఫీ వీడియో



విశ్వనాథ్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న భార్య హరిణి

తాడిపత్రి టౌన్: స్థానిక పోలీసులను శుక్రవారం ఓ సెల్ఫీ వీడియో పరుగులు పెట్టించింది. తాడిపత్రిలోని జయనగర్ కాలనీకి చెందిన విశ్వనాథ్‌కు వైఎస్సార్ జిల్లా వీరపునాయనిపల్లి మండలం అలివేలు ఓబాయపల్లెకి చెందిన హరిణితో వివాహమైంది. ఈ నేపథ్యంలో భార్య హరిణి, ఆమె తల్లి గంగమ్మ, అలివేలు ఓబాయపల్లెకి చెందిన గ్రామ పెద్దలు కొంత కాలంగా తనను వేధింపులకు గురి చేస్తున్నారని, దీంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుంటున్నట్లు విశ్వనాథ్ శుక్రవారం ఉదయం ఓ సెల్ఫీ వీడియో తీసి కుటుంబసభ్యులకు, సచివాలయ పోలీసులకు పంపాడు. సెల్ఫీ వీడియో చూడగానే హరిణి,తల్లి గంగమ్మను పిలుచుకుని పట్టణ సీఐ సాయి ప్రసాద్‌ను సచివాలయ పోలీసు లత కలసి సమస్య వివరించారు. వీడియోను పరిశీలించిన పోలీసులు ఆటో నగర్ సమీపంలో చిత్రీకరించినట్లు నిర్ధారించుకుని బృందాలుగా విడిపోయి విశ్వనాథ్ కోసం గాలింపు చేపట్టారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో చివరకు అతని సెల్‌ఫోన్‌కు కాల్ చేయడంతో సమాధానమిచ్చాడు. స్టేషన్‌కు వస్తే సమస్య పరిష్కరిస్తామని చెప్పడంతో సమస్య సద్దుమణిగింది.

వైఎస్సార్‌సీపీ ప్రచార కమిటీలో పలువురికి చోటు

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అనంతపురం జిల్లాకు చెందిన పలువురికి ఆ పార్టీ రాష్ట్ర ప్రచార విభాగంలో చోటు కల్పిస్తూ.. పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రచార విభాగం కార్యదర్శిగా షేక్ ఇలియాజ్ అహమ్మద్, సహాయ కార్యదర్శిగా పాటిల్ నాగిరెడ్డి నియమితులయ్యారు.

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

- కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: 'రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా చర్యలు చేపట్టడంతో పాటు రోడ్డు భద్రతపై ప్రజల్లో విస్తృతస్థాయిలో అవగాహన కల్పించాలి. యువత మత్తుబారిన పడకుండా చూడాలి'. అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ పి.జగదీష్‌తో కలిసి అధికారులతో రోడ్డు భద్రత, నార్కో కో–ఆర్డినేషన్ సెంటర్ (ఎన్‌సీఓఆర్‌డీ) సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు అవసరమైన అన్ని చర్యలు పకడ్బందీగా తీసుకోవాలన్నారు. ముఖ్యంగా వాహనదారులు హెల్మెట్, సీట్ బెల్ట్ పెట్టుకునేలా అవగాహన కల్పించాలన్నారు.



అధికారులతో సమావేశమైన కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో ఎస్పీ జగదీష్

గుర్తించిన బ్లాక్‌స్పాట్‌ల వద్ద సూచిక బోర్డులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆటోలు, వాహనాలు ఓవర్ లోడింగ్‌తో ప్రయాణించకుండా చూడాలని ఆదేశించారు. మత్తు, మాదకద్రవ్యాలకు యువత బానిస కాకుండా చూడల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మాదక ద్రవ్యాలు సేవించడం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించే కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలన్నారు. మత్తు ప్రదార్థాల అక్రమ రవాణాపై పటిష్ట నిఘా ఉంచాలన్నారు. నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్ అండ్‌బీ ఎస్ఈ రాజగోపాల్, డీటీసీ వీర్రాజు, ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, డీఎస్పీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయండి

ఆర్టీసీ బస్టాండుల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రయాణికులకు తాగునీరు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆర్టీసీ ఆర్‌ఎంను ఆదేశించారు. ప్రతి గ్రామం, పట్టణాల్లో ప్రతి వార్డులోనూ చలివేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ఉద్యోగిపై ఆగని వేధింపులు

- రఘోత్తంరెడ్డికి మరోసారి షోకాజ్ నోటీస్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఉద్యోగులకు ప్రతి నెలా జీతాలు సక్రమంగా చెల్లించమని విజ్ఞప్తి చేసిన బోధనేతర ఉద్యోగుల సంఘం నాయకుడు రఘోత్తంరెడ్డిపై వేధింపులు కొనసాగుతున్నాయి. ఉన్నతాధికారులు రఘోత్తంరెడ్డిపై కక్ష సాధింపులకు దిగేలా తాజాగా మూడో దఫా షోకాజ్ నోటీసు జారీ చేయడమే ఇందుకు నిదర్శనం. జీతాల చెల్లింపులో రిజిస్ట్రార్ రమేష్‌బాబు నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ గత నెలలో రఘోత్తంరెడ్డి బహిరంగ లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రిపై ఎలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు లేఖలో చేయలేదు. బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి పంపడంలో రిజిస్ట్రార్ నిర్లక్ష్యం వహిస్తున్నారని మాత్రమే లేఖలో పేర్కొన్నారు. గతంలో విధులకు గైర్హాజరు అయ్యారని ఒక దఫా లేఖ రాసినప్పుడు షోకాజ్ నోటీసు జారీ చేశారు. చివరిసారిగా ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో తాజాగా మూడో దఫా షోకాజ్ నోటీసు జారీ చేశారు. వరుసగా రెండు దఫాలు మెమో ఇస్తే సస్పెండ్ చేసే అవకాశం ఉండడంతో ఈ మేరకు ఎత్తుగడ వేసినట్లు ఉద్యోగులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. ఎలాంటి తప్పు చేయకపోయినా ఒక వర్గానికి చెందిన ఉద్యోగులను వేధిస్తే.. ప్రభుత్వ పెద్దల మెప్పు పొందవచ్చనేలా ఓ ఉన్నతాధికారి వ్యవహరిస్తున్నట్లు సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వచ్చే పాలకమండలి సమావేశంలో ఈ అంశంపై నిర్ణయం తీసుకోనున్నారు. సమస్య పరిష్కరించాల్సింది పోయి ఇలా కక్ష సాధింపు చర్యలకు దిగడం సరికాదని బోధనేతర ఉద్యోగులు పేర్కొంటున్నారు.


బెల్టుషాపు నిర్వహణకు వేలంపాట



బ్రహ్మసముద్రం మండల కేంద్రంలో బెల్టు షాపు నిర్వహణ కోసం వేలం పాటకు సమావేశమైన 'తమ్ముళ్లు'

- తోపులాటకు దిగిన 'తమ్ముళ్లు'

బ్రహ్మసముద్రం : టీడీపీ నేతలు అక్రమ సంపాదనకు అర్రులు చాస్తున్నారు. ఈ క్రమంలో మద్యం బెల్టుషాపులను ఆదాయ మార్గాలుగా ఎంచుకుంటున్నారు. వాటి కోసం ఆధిపత్య పోరుకు కూడా దిగుతున్నారు. కొన్నిచోట్ల వేలం పాట నిర్వహించి మరీ బెల్టుషాపులను దక్కించుకుంటున్నారు. ఈ క్రమంలోనే బ్రహ్మసముద్రం మండల కేంద్రంలో బెల్టుషాపు నిర్వహణకు శుక్రవారం నిర్వహించిన వేలంపాట రసాభాసగా మారింది. మండలంలోని వేపులపర్తి గ్రామంలో లైసెన్స్‌డ్ మద్యం దుకాణం ఉంది. దీనికి అనుబంధంగా బ్రహ్మసముద్రంలో టీడీపీ కార్యకర్తలు పెద్దసంఖ్యలో బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. అయితే..అన్ని బెల్టుషాపులు ఎత్తేసి ఒకే ఒకటి నిర్వహించాలని, దాన్ని కూడా వేలం పాట ద్వారా కేటాయించాలని టీడీపీ నాయకులు భావించారు. ఈ క్రమంలో శుక్రవారం స్థానిక ఆంజనేయ స్వామి ఆలయం వద్ద సమావేశమయ్యారు. వేలంపాట విషయంలో వారి మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. వేలం పాట నిర్వహించాలని కొందరు..అవసరం లేదని మరికొందరు వాదనకు దిగారు. ఇది కాస్తా పెద్దదయ్యి తోసుకునే స్థాయికి వెళ్లింది. చివరకు కొందరు నాయకులు కలుగజేసుకుని గొడవను సద్దుమణిగించారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు వద్ద పంచాయితీ చేద్దామంటూ వేలంపాటను రద్దు చేసుకున్నారు. ఈ పరిణామాలను ఆసక్తిగా గమనించిన స్థానికులు ముక్కున వేలేసుకున్నారు. ఏదో అభివృద్ధి చేస్తారని గెలిపిస్తే ఇప్పుడిలా మద్యం ఆదాయం కోసం కొట్టుకుంటున్నారని పలువురు వ్యాఖ్యానించారు.



నిరాశపరిచిన స్మైలీ



శుక్రవారం తెల్లవారు జామున ఆకాశంలో శుక్రుడు, శని గ్రహాలు నెలవంకకు అతి చేరువగా వచ్చి చంద్రుడు నవ్వుతున్నట్లు కనిపిస్తుందని 'నాసా' తెలిపింది. కానీ చంద్రుడి పక్కన ఒక్క గ్రహమే రావడంతో చూపరులకు నిరాశ మిగిలింది. అనంతపురంలో కన్పించిన దృశ్యాలివీ.

-సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

మత్తు వదలరా నాయనా..

తాడిపత్రిటౌన్: మత్తు వదలరా నాయనా అంటూ మందుబాబుకు తాడిపత్రి పట్టణ పోలీసులు నీటితో ట్రీట్‌మెంట్ ఇచ్చారు. పట్టణంలోని నందలపాడులో సుంకన్న అనే వ్యక్తి శుక్రవారం మద్యం మత్తులో హల్‌చల్ చేశాడు. కాలనీ వాసులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సీఐ సాయిప్రసాద్ అక్కడికి వెళ్లి మందుబాబును పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. అయితే సుంకన్న పూటుగా మద్యం సేవించి మత్తులో తూగుతుండటంతో స్టేషన్ గేటు ముందు కుళాయి నీటి పైపుతో స్నానం చేయించారు. ఇది చూసిన ప్రజలు మందుబాబుతో పోలీసులకు ఎన్ని అవస్థలు వచ్చాయిరా నాయనా అంటూ చర్చించుకున్నారు. అయితే పోలీసులు స్నానం చేయించాక కాసేపు ఇక్కడే పడుకుంటా సార్ అని సుంకన్న పోలీసులను బతిమాలడం కొసమెరుపు.



మందుబాబుకు కుళాయి నీటితో స్నానం చేయిస్తున్న పోలీసు

9 మందికి ఎంపీడీఓలుగా పదోన్నతి

అనంతపురం సిటీ: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పని చేసే పరిపాలనాధికారులు (ఏఓలు), ఈఓఆర్‌డీలు (మారిన కొత్త హోదా), డిప్యూటీ ఎంపీడీఓలు పలువురికి ఎంపీడీఓలుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు ఆ శాఖ రాష్ట్ర కమిషనర్ వీఆర్ మైలవరపు కృష్ణతేజ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు విడుదల చేశారు. రాష్ట్రస్థాయిలో జరిగిన పదోన్నతుల ప్రక్రియలో ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి ఇద్దరు ఏఓలు, మరో ఏడుగురు డిప్యూటీ ఎంపీడీఓలకు ఎంపీడీఓలుగా పదోన్నతి లభించినట్లు జెడ్పీ వర్గాలు తెలిపాయి. అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏఓగా పని చేస్తున్న వి.ధనుంజయనాథ్, తనకల్లులో ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా పని చేస్తున్న రెడ్డెప్పకు రెగ్యులర్ ఎంపీడీఓ పోస్టులు దక్కాయి. ఇక డిప్యూటీ ఎంపీడీఓలుగా పని చేస్తున్న టీజీ నాగరాజు – హిందూపురం, నసీమ – అమరాపురం, టీ.జిలాన్ బాషా – పుట్లూరు, జి.శివాజీరెడ్డి – గుత్తి, నాగేశ్వరశాస్త్రి – బెళుగుప్ప, మమత –ధర్మవరం, వెంకటలక్ష్మమ్మ– శింగనమలకు డిప్యూటీ ఎంపీడీఓలకూ రెగ్యులర్ ఎంపీడీఓలుగా పదోన్నతి లభించింది.

క్లుప్తంగా

'కార్మిక వ్యతిరేక విధానాలకు స్వస్తి పలకాలి'



రైల్వే స్టేషన్ లాబీ వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

గుంతకల్లు: కార్మిక వ్యతిరేక విధానాలకు రైల్వే యాజమాన్యం స్వస్తి పలకాలని రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. యాజమాన్యం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఎంప్లాయిస్ సంఘ్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మర్రి రాఘవయ్య పిలుపు మేరకు స్థానిక రైల్వేస్టేషన్‌లోని క్రూ లాబీ వద్ద ఎల్ఆర్ఎస్, ఓటీజీ బ్రాంచ్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడారు. లోకో రన్నింగ్ సిబ్బందికి వ్యతిరేకంగా మల్టీడిసిప్లనరీ కమిటీ వ్యవహరిస్తోందన్నారు. హైస్పీడ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో పని చేసే రన్నింగ్ సిబ్బందికి స్పెషల్ అలెవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా విభాగాల కార్మిక సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

అనంతపురం రూరల్: పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించిన వడ్డెర సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేయనున్నారు. ఈ మేరకు వడ్డెర సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డె లక్ష్మీనారాయణ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 500కు పైబడి మార్కులు సాధించిన విద్యార్థులు మే 25వ తేదీలోపు దరఖాస్తులు అందజేయాలి. పూర్తి వివరాలకు 94411 09916, 98662 36626, 99087 45966, 99492 29870లో సంప్రదించవచ్చు.

న్యాక్ దక్కేనా! ప్రతిష్ట నిలిచేనా?

- నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ పరీక్షకు సిద్ధమైన ఎస్కేయూ



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) పరీక్షకు సన్నద్ధమవుతోంది. ఇప్పటికే న్యాక్ గుర్తింపునకు దరఖాస్తు చేసిన నేపథ్యంలో మెరుగైన పాయింట్లను సాధించే దిశగా వర్సిటీ ఉన్నతాధికారులు కృషి చేస్తున్నారు. న్యాక్‌లో గణనీయమైన గ్రేడింగ్ వస్తే పీఎంఉషా (ప్రధాన మంత్రి ఉచ్ఛతార్ శిక్షా అభియాన్) పథకం కింద ఇబ్బడి ముబ్బడిగా నిధులు రానున్నాయి. ఏ ప్లస్, ఏ గ్రేడ్ వస్తే రూ.40 కోట్ల నిధులు మంజూరవుతాయి. ఐదు సంవత్సరాల కాలానికి ఈ నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుంది. వర్సిటీలో మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులు దోహదపడతాయి.

సెల్ఫ్ స్టడీ నివేదికే ప్రామాణికం

ఎస్ఎస్ఆర్ (సెల్ఫ్ స్టడీ రిపోర్ట్)లో పేర్కొన్న అంశాలను ప్రధానంగా న్యాక్ పీర్ కమిటీ పరిశీలించనుంది. ఈ నేపథ్యంలో ఎస్ఎస్ఆర్‌లో పేర్కొన్న అంశాల ప్రాధాన్యత వివరాల సేకరణలో అధికారులు తలమునకలయ్యారు. 2017–18, 2018–19, 2019–20, 2020–21, 2021–22 విద్యా సంవత్సరాల్లో ఆయా విభాగాల్లో సాధించిన ప్రగతి, కోర్సు పూర్తి చేసిన విద్యార్థుల వివరాలు, వారికి దక్కిన ఉద్యోగాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వివరాలు, ఉపకార వేతనాలు, క్యాంపస్‌లో సౌకర్యాలు, హాస్టల్, ఆస్పత్రి సౌకర్యం, యాంటి ర్యాగింగ్ కమిటీ, బొటానికల్ గార్డెన్, హరితవనం తదితర అంశాలను ఎస్ఎస్ఆర్‌లో పొందుపరుస్తున్నారు. అలాగే రూసా, డీఎస్టీ, డీబీటీ నుంచి పొందిన నిధుల వివరాలు, ప్రాజెక్ట్ వివరాలను నమోదు చేస్తున్నారు.

వేధిస్తున్న ప్రతికూల అంశాలు

ఎస్కేయూ క్యాంపస్ కళాశాలలో మొత్తం 268 మంది రెగ్యులర్ అధ్యాపకులు ఉండాల్సి ఉండగా, కేవలం 45 మంది మాత్రమే పనిచేస్తున్నారు. టీచింగ్ అసిస్టెంట్లు, అకడమిక్ కన్సల్టెంట్లతోనే ఇప్పటి వరకూ నెట్టుకొస్తున్నారు. హిస్టరీ, హిందీ, అడల్ట్ ఎడ్యుకేషన్, పాలిమర్ సైన్సెస్ విభాగాల్లో రెగ్యులర్ బోధనా సిబ్బంది ఒక్కరూ కూడా లేరు. ఇంగ్లిష్, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్సెస్, లా కోర్సులకు సంబంధించి ఒక్కొక్క ప్రొఫెసర్ మాత్రమే ఉన్నారు. కెమిస్ట్రీ, కామర్స్, మేథమేటిక్స్, బొటనీ, సెరికల్చర్, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, తదితర విభాగాల్లో అధ్యాపకుల కొరత నెలకొంది. న్యాక్ గుర్తింపులో అధ్యాపకుల అంశానికి సంబంధించి 200 మార్కులు ఉంటాయి. దీంతో ఈ అంశం కాస్త న్యాక్ గ్రేడింగ్‌లో ప్రతికూలంగా చూపే అవకాశం ఉంది. ఈ మార్కులు సాధించాలంటే కనీసం టీచింగ్ అసిస్టెంట్ల నియామకమయినా పూర్తి స్థాయిలో చేయాల్సి ఉంటుంది. మరో వైపు పీజీ కోర్సుల్లో ఏటా ప్రవేశాలు తగ్గుతూ వస్తున్నాయి. అన్ని కోర్సుల్లో కలిపి 1,100 సీట్లు ఉండగా, ఈ ఏడాది 369 మంది మాత్రమే అడ్మిషన్లు పొందారు. తెలుగు విభాగంలో కేవలం ముగ్గురు మాత్రమే అడ్మిషన్ పొందారు.

అనుకూలం కానున్న గత ప్రభుత్వ చర్యలు

న్యాక్ పాయింట్లు పొందేందుకు మౌలిక సదుపాయాల కల్పన ప్రధానం. గత ప్రభుత్వం హయాంలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని లా విభాగం నుంచి క్యాంటీన్, పూలే భవనం, కామన్ మెస్ హాల్ వరకూ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇందు కోసం రూ.2.31 కోట్లు వెచ్చించారు. ఐఎస్ఓ (ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండరైజేషన్) గుర్తింపు తీసుకొచ్చారు. క్వాలిటీ మేనేజ్‌మెంట్, ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్, ఎనర్జీ మేనేజ్‌మెంట్, గ్రీన్ ఆడిట్ విభాగాల్లో ఐఎస్ఓ గుర్తింపు వచ్చింది. ఐఎస్ఓ గుర్తింపుతో న్యాక్‌లో పాయింట్లు పెరగనున్నాయి.

మెరుగైన గ్రేడింగ్ సాధించేలా కృషి



నాణ్యమైన పరిశోధనలను ప్రోత్సహిస్తున్నాం. ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో గణనీయమైన ప్రగతి సాధించాం. అనుబంధ కళాశాలల్లోనూ గణనీయమైన పురోగతి ఉంది. న్యాక్‌లో మెరుగైన గ్రేడింగ్ సాధించేందుకు కృషి చేస్తాం.

– ఆచార్య బి.అనిత, ఇన్‌చార్జి వీసీ, ఎస్కేయూ

గిన్నిస్ బుక్‌లో 'అనంత' వాసికి చోటు



అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన మేరీ ప్రత్యూష గుజ్జారి... గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. 2024, డిసెంబరు 1 హల్లెల్ మ్యూజిక్ స్కూల్ ఆధ్వర్యంలో ప్రపంచ స్థాయి సంగీత కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 18 దేశాలకు చెందిన 1,046 మంది కీబోర్డు ప్లేయర్లు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఇందులో నగరానికి చెందిన ప్రత్యూష గుజ్జారితో పాటూ మరి కొందరి ఖ్యాతిని గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు చేస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించి, హైదరాబాదులోని లైఫ్ చర్చిలో క్రైస్తవ పెద్దల ద్వారా సర్టిఫికెట్‌ను, జ్ఞాపికను అందజేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం స్థానిక సీఎస్ఐ చర్చిలో ప్రత్యూష గుజ్జారి, ఆమె భర్త డేనియల్ జక్కం, మామ జెడ్.దేవరాజును పలువురు అభినందించారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్

పుట్లూరు: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై అత్యాచార యత్నం చేసిన నిందితుడిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మూడు రోజుల క్రితం పోక్సో చట్టం కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం నిందితుడిని అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న ఆటో

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో ఓ ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఆటో ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... శుక్రవారం ఉదయం యాడికి మండలం చందన గ్రామానికి చెందిన నారాయణమ్మకు చెయ్యి విరిగింది. దీంతో ఆమెను పిలుచుకుని అనంతపురంలోని ఆస్పత్రికి ఆటోలో కుమారుడు ఆటో డ్రైవర్ ప్రసాద్ బయలుదేరాడు. మార్గ మధ్యంలో గుత్తిలోని బెస్తగేరికి చెందిన వెంకటలక్ష్మి ఆటోను ఆపి ఎక్కారు. అనంతరం గుత్తి వైపుగా వెళ్తుండగా కొత్తపేట గ్రామ శివారులో 67వ జాతీయ రహదారిపై ఎదురుగా ఇటుకల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఆటో వేగంగా వెళ్లి ఢీకొంది. ప్రమాదంలో నారాయణమ్మ, వెంకటలక్ష్మి, ప్రసాద్‌కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను అటుగా వెళుతున్న వారు గుర్తించి చికిత్స కోసం గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురానికి వైద్యులు రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు, చేసి దర్యాప్తు చేపట్టారు.

పబ్లిక్ బోరు బావి కబ్జా

- టీడీపీ సర్పంచ్ నిర్వాకంతో గ్రామస్తులకు ఇక్కట్లు


బోరు బావి నుంచి పొలానికి నీటిని మళ్లిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం: ప్రజల దాహార్తిని తీర్చేందుకు వేయించిన బోరుబావిని ఆ గ్రామ టీడీపీ సర్పంచ్ కబ్జా చేశారు. ఇదేమని ప్రశ్నిస్తే.. ఇది తమ ప్రభుత్వమని... తానే బోరు వేయించానని బుకాయిస్తూ దౌర్జన్యానికి తెరలేపారు. స్థానికులు తెలిపిన మేరకు... బ్రహ్మసముద్రం మండలం నాగిరెడ్డిపల్లిలో తాగునీటి ఇబ్బంది తీవ్రంగా ఉందంటూ గత ఎన్నికల సమయంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు దృష్టికి ఆ గ్రామ సర్పంచ్ (టీడీపీ) కె.సందీప్‌కుమార్ తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన ప్రజల దాహార్తిని తీర్చేందుకు బోరు వేయించి, పంచాయతీకి అప్పగించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సర్పంచ్ ఆగడాలు పెచ్చుమీరాయి. ఈ నేపథ్యంలోనే పబ్లిక్ బోరుకు ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటు చేసి అర కిలోమీటరు దూరంలో ఉన్న తన పొలానికి నీటిని మళ్లించుకోసాగారు. ఇందు కోసం పంచాయతీకి సంబంధించిన విద్యుత్‌ను వినియోగించుకుంటున్నారు. వేసవిలో తాగునీరు అందక ఇబ్బంది పడుతున్న ప్రజలు ఇటీవల సర్పంచ్‌ను కలిసి సమస్య విన్నవించారు. పబ్లిక్ బోరు నీటిని ప్రజల దాహార్తిని తీర్చేందుకు కేటాయించాలని కోరారు. దీంతో సర్పంచ్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆ బోరు బావిని తానే వేయించానని బుకాయిస్తూ 'ఇది మా ప్రభుత్వం... అంతా మా ఇష్టం.. దిక్కున్న చోటుకెళ్లి చెప్పుకోండి' అంటూ దౌర్జన్యానికి దిగారు. అంతే కాక 24 గంటల పాటు బోరు బావి నీటిని పొలానికి మళ్లించుకుంటూ ప్రజలకు చుక్క నీటిని వదలడం లేదు. జిల్లా అధికారులు స్పందించి తమ తాగునీటి ఇక్కట్లు తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పీఆర్సీ ఏర్పాటు చేయాలి

- మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి డిమాండ్
- గుత్తిలో ఎస్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశం


మాట్లాడుతున్న కత్తి నరసింహారెడ్డి

గుత్తి: పీఆర్సీ ఏర్పాటుతో పాటు ఐఆర్‌ను వెంటనే మంజూరు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. గుత్తిలోని పద్మవాణి ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎస్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ.. 30 శాతం ఐఆర్‌ను తక్షణమే ప్రకటించాలన్నారు. ఆర్థిక బకాయిలు రూ.30 వేల కోట్లకు గాను కేవలం రూ.7,300 కోట్లు మంజూరు చేయడం చూస్తుంటే ఈ ప్రభుత్వానికి ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల పట్ల ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థం చేసుకోవచ్చునన్నారు. ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథ్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, రామాంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సూర్యుడు, కె.చంద్రశేఖర్ తదితరులు మాట్లాడుతూ... జీఓ 117ను వెంటనే రద్దు చేయాలన్నారు. అలాగే 72, 73, 74 జీఓల అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ఇన్‌చార్జ్ నాగరాజు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, గుత్తి ఎంఈఓలు రవినాయక్, మనోహర్, ఎస్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆసీఫ్, బసవరాజు, సీనియర్ నాయకులు శివ శంకర్, సత్య, జోగి శీన, పద్మవాణి బాబు తదితరులు పాల్గొన్నారు.

'ఖరీఫ్'కు సిద్ధంకండి

- వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ ఆదేశం


మాట్లాడుతున్న జేడీఏ ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాకు సంబంధించి కీలకమైన ఖరీఫ్ జూన్ నుంచి మొదలు కానుండటంతో క్షేత్రస్థాయిలో రైతులు ఇబ్బంది పడకుండా ముందస్తు జాగ్రత్తలతో అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులను వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. శుక్రవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో అనంతపురం డివిజన్ ఏడీఏ ఎం.రవితో కలిసి ఆరు మండలాల ఏఓలు, ఏఈఓలు, ఆర్ఎస్‌కే అసిస్టెంట్లతో ఖరీఫ్ పంటల సాగుపై సమీక్షించారు. జూన్ నుంచి ఖరీఫ్ మొదలవుతున్నా... ఇప్పటి నుంచే సన్నాహక చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా రాయితీ విత్తన వేరుశనగ పంపిణీ ప్రక్రియపై దృష్టి సారించాలన్నారు. ఆర్ఎస్‌కే వేదికగా పంపిణీ సజావుగా జరగాలన్నారు. విత్తన నాణ్యతపై దృష్టి సారించాలన్నారు. అలాగే ఎరువుల సమస్య లేకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. భూసార పరీక్షలకు సంబంధించి టార్గెట్లు వచ్చాయని, వేసవిలోనే పొలాలకు వెళ్లి మట్టి నమూనాలు సేకరించి పంపాలని ఆదేశించారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. వ్యవసాయ యాంత్రీకరణకు సంబంధించి రైతులను ప్రోత్సహించాలన్నారు. విత్తనాలు, ఎరువులు, ఇతరత్రా నాన్‌సబ్సిడీ బకాయిలు లేకుండా వెంటనే చెల్లించాలని ఆదేశించారు. సమావేశంలో ఏఓలు జె.శశికళ, పి.సోమశేఖర్, శ్యాంసుందరరెడ్డి, సుచరిత, విజయకుమార్ పాల్గొన్నారు.

నీవు వచ్చేంత వరకూ ఇక్కడే ఉంటానని..

కళ్యాణదుర్గం రూరల్: ఉదయం నిద్రలేవగానే ఏదో తెలియని అలజడి.. గుండెను ఎవరో మెలిక పెడుతున్నట్లుగా బాధ... అయినా మనువరాలి పరీక్ష కోసం అన్నీ ఓర్చుకున్నాడు. ఆటోలో పిలుచుకొచ్చి 'నీవు వచ్చేంత వరకూ ఇక్కడే ఉంటా తల్లీ' అంటూ పరీక్ష కేంద్రం వద్ద వదిలాడు. లోపల మనవరాలు పరీక్ష రాస్తుండగా బయట ఆటోలో గుండెపోటుతో మృతిచెందాడు. హృదయ విదారకమైన ఈ ఘటన అనంతపురంలో చోటు చేసుకుంది. వివరాలు... కళ్యాణదుర్గం మండలం మల్లికార్జునపల్లికి చెందిన రైతు, మాజీ సర్పంచ్ బొజ్జన్న (65) శుక్రవారం ఉదయం తన మనవరాలు చంద్రకళను పిలుచుకుని ఏపీఆర్‌జేసీ పరీక్షలు రాయించేందుకు అద్దె ఆటోలో అనంతపురానికి చేరుకున్నారు. మధ్యాహ్నం పరీక్ష కేంద్రం వద్ద కాస్త నలతగా ఉండడం గమనించిన చంద్రకళ 'తాతా ఏమైంది' అంటూ అడగడంతో తనకేమీ కాలేదని నవ్వుతూ పరీక్ష రాసి వచ్చేంత వరకూ తాను అక్కడే ఉంటానని, బాగా రాయాలంటూ చెప్పి కేంద్రంలోకి పంపాడు. అనంతరం ఆటోలోనే సేదదీరుతూ గుండెపోటుకు గురై మృతి చెందాడు. పరీక్ష ముగిసిన తర్వాత బయటకు వచ్చిన చంద్రకళ నేరుగా ఆటో వద్దకు చేరుకుంది. తాత నిద్రిస్తున్నాడనుకుని లేపేందుకు ప్రయత్నించడంతో ఆయన సీటులోనే జారిపోయాడు. దీంతో మృతి చెందినట్లుగా నిర్ధారించుకుని బోరున విలపించింది. 'నేను వచ్చేంత వరకూ ఇక్కడే ఉంటానని.. ఎక్కడికెళ్లావ్ తాతా..' అంటూ ఆమె రోదించిన తీరు అందరినీ కంట తడి పెట్టించింది. స్థానికుడి ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిన అనంతపురానికి చేరుకుని సాయంత్రానికి మృతదేహాన్ని తీసుకుని స్వగ్రామానికి చేరుకున్నారు.

వడడెబ్బతో విద్యార్థిని మృతి


గౌతమి (ఫైల్)

పెద్దపప్పూరు: వడదెబ్బ ప్రభావంతో ఓ విద్యార్థిని మృతి చెందింది. స్థానికులు తెలిపిన మేరకు... పెద్దపప్పూరు మండలం చాగల్లు గ్రామానికి చెందిన గంగరాజు, కవిత దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఎనిమిదేళ్ల క్రితం అనారోగ్యాన్ని తాళలేక గంగరాజు ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి కవిత వ్యవసాయ కూలి పనులతో ఇద్దరు కుమార్తెలను పెంచి పోషించుకుంటోంది. ఈ నేపథ్యంలో గురువారం వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురం మండలం గూడూరు అంకాలమ్మ ఆలయానికి వెళ్లి వచ్చారు. ఎండ వేడిమి కారణంగా ఇంటికి చేరుకోగానే కుమార్తె గౌతమి (10)కి వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి. జ్వరం వచ్చినట్లు శరీరం మొత్తం కాలిపోతుండడంతో వడదెబ్బకు గురైనట్లుగా నిర్ధారించుకుని బంధువులు వెంటనే తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం అక్కడి వైద్యులు అనంతపురానికి రెఫర్ చేశారు. పరిస్థితి విషమిస్తుండడంతో సర్వజనాస్పత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజామున అక్కడి ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలిక మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా, చాగల్లులోని ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న గౌతమి మృతి విషయం తెలియగానే ఉపాధ్యాయులు, ఎంఈఓ ఓబులపతి, తదితరులు విద్యార్థి మృతదేహాన్ని పరిశీలించి, నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DMLT ADMISSIONS

■ DMLT 2 సంవత్సరముల కోర్సునకు అడ్మిషన్లు జరుగుచున్నవి. Q: ఇంటర్ పాస్ (ఏ గ్రూప్ అయిన) అర్హులైన వారికి స్కాలర్ షిప్ కలదు. # SEEDS కాలేజ్, కమలానగర్, అనంతపురం. సెల్: 9100494926, 9440255034. [A-1600]

REAL ESTATE

SITE FOR SALE

■ 27×75=4.68 cents plot, 100 yards from service road of by-pass road back side Bajaj Service Center, Opp: D-Mart, Kovoor Nagar, Anantapur. North facing open plot, 20 feet road, North side. Cont: 9940232212, 89788 70118. [A-1587]

SERVICES

CHANGE OF NAME

■ I, SAKE PRAVALLIKA (Old Name) W/o SAKE JAYAPPA, R/o 11-1-536, Krupananda Nagar, Anantapur (T&D), A.P. I Have change my name to GUJJALA PRAVALLIKA. Henceforth I will be known as GUJJALA PRAVALLIKA W/o SAKE JAYAPPA for all purpose. [A-1599]

BUSINESS OFFER

■ మా సంస్థకి సెల్ ఫోన్ ద్వారా పార్ట్/ఫుల్ టైంగా సర్వే చేయుటకు ప్రతి ఒక్కరికి అవకాశం. పూర్తి శిక్షణ, నో టార్గెట్, నో సేల్స్. నెలకి అత్యధిక సంపాదన షరతులు వర్తిస్తాయి. 8977209682 [HA-15181]

WANTED

■ WANTED TEACHERS : లేపాక్షి మండలం కొండూరు గ్రామంలో గల, A.S.GLOBAL E.M. SCHOOL నందు పనిచేయుటకు అనుభవం గల టీచర్స్ కావలెను. 9848116395, 8341772403. [A-1601]

■ ఉద్యోగ అవకాశం: హోమ్ అప్లయన్స్, జిల్లా వ్యాప్తంగా మార్కెటింగ్ కొరకు, అనుభవం కలిగిన సేల్స్ ఎగ్జిక్యూటివ్ కావలెను. మంచి జీతం + TA, DA ఇవ్వబడును. సంప్ర: 9000786886, శ్రీ విష్ణు ఎంటర్ ప్రైజెస్, ATP. [A-1584]

■ మీ ఇంటివద్దనే వుంటూ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25-30వేలు వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్: 95504 67459. [M-1268570]

■ ప్రముఖ విద్యాసంస్థలో పనిచేయుటకు స్త్రీలు/పురుషులు వార్డెన్స్‌గా మరియు హాస్టల్ ఇన్‌చార్జెస్‌గా కావలెను. వయస్సు: 21సం॥ ఆపైన ఉండవలెను. జీతము: 10,000/- నుండి 15,000/- వరకు ఇవ్వబడును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 8978480435 [G-5963]

■ Wanted female teachers for primary and pre-primary classes - Lotus kids International School @ Anantapur Town. Contact: 9121178559. [SCA25002930]

■ WANTED (Only Females), RECEPTIONIST, TELE CALLERS. Qul: Degree / B.Tech. Sal: 8K-12K + Incentives. Location: ATP. Ph: 6303220866, 9676836928. [A-73]

■ Wanted Experience Civil Engineers & Supervisors in Building constructions experience candidates for well Established Company Anantapur. Cont: 9000677088. [A-3939]

■ ప్రముఖ కంపెనీ నందు వర్క్ చేయుటకు M/F కావలెను. Qul: 10th - డిగ్రీ. మంచిజీతం, ఉచిత రూము, భోజనం సదుపాయం. వర్క్ ఫ్రం హోం అవకాశం. 80888 47541. [G-91]

క్లుప్తంగా

కమనీయం.. శ్రీనివాస కల్యాణం



శ్రీనివాసుడికి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

అనంతపురం కల్చరల్: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాస కల్యాణం శుక్రవారం కమనీయంగా సాగింది. నగరంలోని ఆదిమూర్తినగర్ వేమన టెలిఫోన్ భవన్ ఎదురుగా ఉన్న షిరిడీ సాయిబాబా మందిరంలో ఉదయం భక్తిశ్రద్ధలతో సామూహిక విష్ణుసహస్రనామ పారాయణం జరిగింది. వందలాది మంది భక్తులు బారులు తీరి విష్ణునామస్మరణ చేశారు. అనంతరం వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల హోరు, భక్తాదుల గోవింద నామస్మరణ నడుమ కల్యాణాన్ని వేదపండితులు, మణూరు నాగరాజు బృందం వైభవంగా జరిపించారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ అధ్యక్షుడు జయచంద్ర చౌదరి ఆధ్వర్యంలో సాయినాథుడికి అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. అనంతరం అలంకార సేవలు, తీర్థప్రసాద వినియోగం, అన్నదాన సేవ నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రవీంద్ర, వెంకటస్వామి, నాగానందం, రాఘవేంద్ర గుప్తా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఏడీఏ రవికి సన్మానం

అనంతపురం అగ్రికల్చర్: మార్చి నెలాఖరుతో ముగిసిన 2024–25 ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన లక్ష్యాలు సాధించేందుకు ఏడీఏ ఎం.రవి సహకరించారని ఏఓలు, ఏఈఓలు తెలిపారు. శుక్రవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏడీఏ ఎం.రవిని ఏఓలు జె.శశికళ, శ్యాంసుందరరెడ్డి, సుచరిత, సాయిలత, విజయకుమార్, ఏఈవోలు మురళీక్రిష్ణ, సుజిత తదితరులు పుష్పగుచ్ఛం, శాలువా కప్పి సత్కరించారు. ప్రభుత్వం, రైతులకు వారధిగా ముందు మరింత సమర్థవంతంగా సేవలందించి డివిజన్‌కు మంచి పేరు తీసుకురావాలని ఏడీఏ సూచించారు.

చెత్త కుప్పలకు అగ్గి పెట్టొద్దు



శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్‌ను మందలిస్తున్న కమిషనర్ బాలస్వామి

అనంతపురం కార్పొరేషన్: చెత్తను ఎప్పటికప్పుడు కంపోస్టుకు తరలించేలా చూడాలి. చెత్త ఎక్కువగా ఉందని చెత్త కుప్పలకు నిప్పు పెడితే ఉపేక్షించేది లేదని శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్‌పై కమిషనర్ బాలస్వామి మండిపడ్డారు. శుక్రవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఇంటింటా చెత్త సేకరణ చేపట్టాలన్నారు. చెత్త కుప్పలకు అగ్గి పెడితే హానికరమైన వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. రెగ్యులర్ వర్కర్లకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. వ్యాపారులు చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు.

కీట్స్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ, ఉపాధి

అనంతపురం అగ్రికల్చర్: విజయవాడ కీట్స్ ఎన్‌జీఓ సంస్థ ఆధ్వర్యంలో డీడీయూ–జీకేవై కార్యక్రమంలో భాగంగా జూనియర్ సాఫ్ట్‌వేర్ వెబ్ డెవలపర్ (జేఎస్‌డీ) కోర్సులో ఆరు నెలల పాటు ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు అడ్మిషన్స్ కో–ఆర్డినేటర్ హరిప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 20 నుంచి 30 సంవత్సరాల వయస్సున్న ఏదైనా డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ కోర్సు పాస్ లేదా ఫెయిలై కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విజయవాడ కీట్స్ సంస్థ ట్రైనింగ్ సెంటర్‌లో నైపుణ్య శిక్షణ ఇవ్వడంతో పాటు సర్టిఫికెట్ అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. 100 శాతం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జూనియర్ సాఫ్ట్‌వేర్ వెబ్ డెవలపర్‌తో పాటు సీ, సీ ప్లస్, జావా స్క్రిప్ట్, వెబ్ డిజైనింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్స్, లైఫ్ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9000487423 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

స.హ చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న జిల్లా ఎక్సైజ్ అధికారి బి.రామమోహన్ రెడ్డి

అనంతపురం: పారదర్శకత, ప్రజాపాలనలో బాధ్యతాయుతమైన సేవలు అందించడమే సమాచార హక్కు చట్టం ముఖ్య ఉద్దేశమని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి బి.రామమోహన్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, తదితర అధికారులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లోపు సమాచారాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో పౌర సమాచార అధికారి ఎస్.రేవతి, సహాయ పౌర సమాచార అధికారి బి.రత్న శిరోమణి తదితరులు పాల్గొన్నారు.

మరీ ఇంత అధ్వానమా?

- జీజీహెచ్‌లో డైట్ నిర్వహణ సురక్షిత ప్రమాణాలు నిల్..
- రోగుల ఆరోగ్యంతో డైట్ నిర్వాహకుడి చెలగాటం
- రక్షిత నీటిని వాడటంలో అలసత్వం
- ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలో వెలుగు చూసిన లోపాలు
- 12 లోపాలను ఎత్తి చూపిన అధికారులు



చెత్తాచెదారం పక్కనే భోజనం ఏవిధంగా తయారు చేస్తారని డైట్ నిర్వాహకుడిని ప్రశ్నిస్తున్న అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కళ్యాణ్ చక్రవర్తి

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని డైట్ నిర్వహణ.. ప్రమాద ఘంటికలను తలపిస్తోంది. డైట్ నిర్వాహకుడు ఎటువంటి సురక్షిత ప్రమాణాలు పాటించడం లేదు. రోగుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. డైట్ నిర్వహణ అస్తవ్యస్తంగా ఉన్నట్లు.. ఎటువంటి సురక్షిత ప్రమాణాలు పాటించడం లేదని, భోజనం తయారీ చేసి తాగునీరు సరిగా లేదని ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. ఇటీవల సాక్షి దినపత్రికలో ×వామ్మో ఇదేం డైట్¤ శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ స్పందించారు. వెంటనే తనిఖీలు చేపట్టాలని ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఫుడ్ అండ్ సేఫ్టీ స్టాండర్డ్స్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కళ్యాణ్ చక్రవర్తి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తస్లీమ్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జున రెడ్డి తనిఖీలు చేపట్టారు. 12 లోపాలను గుర్తించినట్లు సాక్షాత్తు డీపీఆర్‌ఓ నుంచి లేఖను సాక్షికి పంపారు.

డైట్ నిర్వహణ అస్తవ్యస్తం..

ఆస్పత్రి ఆవరణలో వెనుక వైపు ఉన్న పాడుబడ్డ భవనంలో చేస్తున్న డైట్ నుంచి అధికారులు నివ్వెరపోయారు. పాడుబడ్డ భవనంలోని చిన్నపాటి మూడు గదులు, అక్కడే నేలపైనే కూరగాయలు తరగడం, కనీసం వాటిని శుభ్రం చేసుకోవడానికి ఎటువంటి ట్యాప్ లేకపోవడం, కిచెన్ ఫ్లోర్ గుంతలు గుంతలుగా ఉండి నీరు నిల్వ ఉండడాన్ని చూసి అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యం 700 మంది రోగులు, వైద్యులు, సిబ్బందికి అందించే డైట్‌ను ఈ విధంగా ఉంచితే ఎలాగని కాంట్రాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డిని ఆరా తీశారు. చివరకు అక్కడున్న పరిస్థితులపై అధికారులు ప్రశ్నిస్తుంటే డైట్ నిర్వాహకుడి నుంచి ఎటువంటి సమాధానం రాలేదు.

డైట్ ప్రాంతం మార్చడమే శ్రేయస్కరం

ప్రస్తుతం జీజీహెచ్‌లో తయారు చేస్తున్న డైట్‌ను మార్చడమే శ్రేయస్కరమని సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావుకు ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు సూచించినట్లు తెలిసింది. డైట్ నిర్వహణకు ఇక్కడ పరిస్థితులు ఏమాత్రం బాగోలేవని.. భవిష్యత్తులో కలుషితం జరిగితే రోగుల ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉన్నట్లు తెలిపారు. సాధ్యమైనంత త్వరగా డైట్ ప్రాంతాన్ని మరో అనువైన చోటికి మార్చాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం మరిన్ని సురక్షిత ప్రమాణాలు పాటించాలని చెబుతున్నారు.

లోపాలు ఇవే..

- డైట్‌లో ఎటువంటి స్వచ్ఛత పాటించడం లేదు. డైట్ ఆవరణ, పరిసర ప్రాంతాల్లో ఎటువంటి సురక్షిత ప్రమాణాలు లేవు. చెత్త చెదారం ఉన్న చోట కనీసం కిటికీలకు మెష్ వేయకుండా వంటలు చేస్తున్నారు.
- శుభ్రతకు సంబంధించిన ఎటువంటి రికార్డులను నమోదు చేయలేదు.
- కిచెన్ ఫ్లోర్ జారే విధంగా ఉండటంతో పాటు నీరు నిల్వ ఉంటోంది.
- ప్రధానంగా డైట్‌కు వాడే నీరు పరిశుభ్రంగా ఉండటం లేదు. భవనం పైన ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకును శుభ్రం చేయక చాలా రోజులు అవుతోంది. ఆ నీటితోనే భోజనం తయారు చేస్తున్నారు. పోటబుల్ వాటర్ టెస్టింగ్స్ చేసినట్లు ఎటువంటి రికార్డులు లేవు. ప్రతి 3 నెలలకు ఒకసారి నీటి పరీక్ష చేయాలి. కీటకజనిత (పెస్ట్ కంట్రోల్) నివారణ చర్యలు చేపట్టలేదు.
- డైట్‌లో పెయింట్ పెచ్చులూడి రాలుతోంది. పైప్‌లైన్ లీకేజీలు కనిపించాయి.
- వంట చేసే, సహాయ సిబ్బంది ఎటువంటి వ్యక్తిగత శుభ్రత పాటించడం లేదు.
- ఈగలు, కీటకాలు తదితర వాటిని నుంచి రక్షణ పొందేందుకు పరికరాలు లేవు.
- టాయిలెట్, క్లీనింగ్ ఫెసిలిటీస్, లిక్విడ్ హ్యాండ్ వాష్‌లు లేవు.
- స్టోరేజ్ ఫెసిలిటీస్ లేకపోవడం, కూరగాయలు నేలపై ఉంచారు. ఎర్రగడ్డలు మూలకు పడేశారు.
- డైట్‌లో ఎటువంటి వెలుతురు లేదు. కిటికీలకు మెష్ వేయలేదు.

నేడు అరుణాచలేశ్వరుడి కల్యాణం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం కల్చరల్: నగరంలోని మూడవ రోడ్డు జీఆర్ ఫంక్షన్ హాలులో మాసశివరాత్రి సందర్భంగా శనివారం అరుణాచలేశ్వరుడి కల్యాణం నిర్వహిస్తున్నట్లు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం సాయి ట్రస్టు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. సాయిట్రస్టు ప్రతినిధి విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. అరుణాచల పుణ్యక్షేత్రానికి తండోపతండాలుగా భక్తులు వెళ్తున్నారని.. అయితే అక్కడికి వెళ్లలేని వారికి అరుణాచల గిరి దర్శనం కల్పిస్తున్నామని తెలిపారు. గోపూజలు, సుబ్రహ్మణ్యేశ్వర పూజ, మహారుద్రాభిషేకం అనంతరం కల్యాణం జరుగుతుందని పేర్కొన్నారు.

స్టాక్ పాయింట్ తనిఖీ

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని పౌర సరఫరాల గోదామును (స్టాక్ పాయింట్) ఎమ్మెల్యే పరిటాల సునీత శుక్రవారం తనిఖీ చేశారు. గోదాములో ఉన్న స్టాక్ వివరాలను స్టాక్ పాయింట్ అధికారి లక్ష్మీ నారాయణను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఉన్న స్టాక్‌ను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్ కుమార్, సీఎస్‌డీటీ సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్' అమలు చేయరా?



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్

అనంతపురం అర్బన్: 'భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని కూటమి ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ఎన్నికల్లో హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి పది నెలలైనా ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదు.' అని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్ ధ్వజమెత్తారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు వెంకట నారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాగేంద్రకుమార్‌తో పాటు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడారు. భవన కార్మికుల సంక్షేమం కోసం గతంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేశారన్నారు. అటు తరువాత వచ్చిన కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం, చంద్రబాబు ప్రభుత్వాలు నిధులను పక్కదారి పట్టించి బోర్డును నిర్వీర్యం చేశాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా ప్రజలను దగా చేశారని మండిపడ్డారు. భవన కార్మికులకు నష్టదాయకమైన లేబర్ కోడ్‌లు రద్దు చేయాలన్నారు. కార్మికుల సంక్షేమ పథకాల అమలుకు వసూలు చేసిన సెస్ నిధులను వారి సంక్షేమానికే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ వినోద్ కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఆర్‌వీ నాయుడు, ముత్తుజ, ఇర్ఫాన్, మజీద్, రజాక్ భాటియా, సూర్యనారాయణ, అబ్బాస్, రామాంజనేయులు, కృష్ణ, జిలాన్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మజెముడు సాగుతో లాభాలు



బ్రహ్మజెముడు మొక్కలను చూపుతున్న డ్వామా పీడీ సలీం

రాప్తాడు: మండలంలోని హంపాపురం గ్రామంలో వాటర్‌షెడ్ ప్రోగ్రాం కింద మధురనాథ్ అనే రైతు పొలంలో శుక్రవారం కేక్టస్ (బ్రహ్మజెముడు) మొక్కల పెంపకాన్ని అధికారులు చేపట్టారు. వాటర్ షెడ్ షెడ్ ప్రొగ్రాంలో భాగంగా డ్వామా పీడీ సలీం, అడిషనల్ పీడీ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో రైతు పొలంలో అధికారులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. హంపాపురం గ్రామంలో 2.5 ఎకరాల్లో ఈ మొక్కలు నాటడం జరిగిందన్నారు. ఈ మొక్కను ఆయుర్వేదంలో అనేక వ్యాధులకు ఔషధంగా వాడుకోవచ్చని తెలిపారు. చర్మ వ్యాధులకు ఎక్కువగా వాడుతారని పేర్కొన్నారు. ఈ మొక్క కాయలు తినడం వల్ల కంటి సమస్యలు కూడా తగ్గుతాయన్నారు. రుతుక్రమ దోషాలు, ఒంటి నొప్పులు కూడా తగ్గుతాయని తెలిపారు. పాడి పశువులకు గ్రాసం వేయడం వల్ల పాల దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీడీ కృష్ణ చైతన్య, ఎంపీడీఓ విజయలక్ష్మి, పీఓ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ(ఏ)కు ఐసీఐసీఐ దన్ను

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ)కు ఐసీసీఐ ఫౌండేషన్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ కింద దన్నుగా నిలుస్తోంది. క్యాంపస్‌లో చెట్ల పెంపకం, పరిశోధన ప్రాజెక్టుల నిర్వహణ తదితర అంశాలకు స్పాన్సర్‌గా వ్యవహరించనుంది. ఈ నేపథ్యంలో జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు అధ్యక్షతన ఐసీసీఐ ఫౌండేషన్ అధికారులు, వర్సిటీ డైరెక్టర్లు సమావేశమయ్యారు. ఐసీఐసీఐ ఫౌండేషన్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శరత్ కుమార్ సీఎస్ఆర్ ఫండ్స్ మార్గదర్శకాలను వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కృష్ణయ్య పాల్గొన్నారు.



ఈఎన్‌టీ ఓపీలో ఆడియాలజిస్టు కోసం పడిగాపులు కాస్తున్న దివ్యాంగులు

సారు ఎప్పుడొస్తారో?

కూటమి ప్రభుత్వంలో సదరం సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ దివ్యాంగులకు ముచ్చెమటలు పట్టిస్తోంది. శుక్రవారం సర్వజనాస్పత్రిలోని ఈఎన్‌టీ ఓపీలో దివ్యాంగులకు మళ్లీ వినికిడి శాతాన్ని పరీక్షించాలని వైద్యులు ఆదేశించారు. దీంతో ధర్మవరం నుంచి డెప్యూటేషన్‌పై వచ్చిన ఆడియాలజిస్టు (డీసీహెచ్ఎస్ పరిధి) పత్తా లేకుండా పోయారు. దీంతో శ్రీసత్యసాయి జిల్లా నుంచి వచ్చిన దివ్యాంగులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. ఎక్కువ సేపు నిలుచోలేక కటిక నేలపైనే వృద్ధులు, చిన్నారులు, మహిళలు ఇబ్బందులు పడ్డారు. ఎప్పుడెప్పుడు ఆడియాలజిస్టు వస్తారా? అని ఎదురు చూశారు. చివరకు సర్వజనాస్పత్రి అధికారులు చొరవ తీసుకుని పత్యామ్నాయ చర్యలు తీసుకున్నారు.

– అనంతపురం మెడికల్:

ఉగ్రదాడి హేయమైన చర్య



కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న సీఐటీయూ, యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు



టవర్‌క్లాక్ వద్ద నివాళులర్పిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

అనంతపురం అర్బన్: పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేసి, 26 మందిని చంపడం అత్యంత హేయమైన అనాగరిక చర్య అని సీఐటీయూ, యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక ఉపాధ్యాయ భవన్ నుంచి క్లాక్‌టవర్ వరకూ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి మృతులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘాల జిల్లా ప్రధాన కార్యదర్శులు నాగేంద్ర కుమార్, లింగమయ్య, పరమేష్ మాట్లాడారు. మతం పేరుతో దాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలన్నారు. జరిగిన ఘటనకు కొందరు మతోన్మాదులు మతం రంగు పులిమి ప్రజల మధ్య ఐక్యతకు చిచ్చుపేట్టే యత్నాలను ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు గోవిందరాజులు, నాగమణి, మహమ్మద్ జిలాన్, రమణయ్య, కోటేశ్వరప్ప, శివానంద, సరళ, దేవేంద్రమ్మ, రాజేంద్ర, ముత్తుజ, వెంకట నారాయణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

విశ్వహిందూ పరిషత్తు ఆధ్వర్యంలో..

అనంతపురం కల్చరల్: పహల్గాంలో పర్యాటకులను చంపిన వారిని శిక్షించాలని విశ్వహిందూ పరిషత్తు నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం రాత్రి స్థానిక టవర్‌క్లాక్ వద్ద ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. ఆర్ఎస్ఎస్ విభాగ్ సంఘ్ చాలక్ హిమకర్‌జీ మాట్లాడుతూ.. కశ్మీర్‌లో కేవలం హిందువులను మాత్రమే లక్ష్యం చేసుకున్న పాకిస్థానీ దుండగులను ఏరిపారేయడానికి అందరూ ఐక్యంగా ఉండి ప్రధాని మోదీకి అండగా నిలవాలన్నారు. మరోసారి ఇటువంటి సంఘటన పునరావృతం కాకుండా కేంద్రం కఠినంగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రత్నమయ్య, విశ్వనాథరెడ్డి, కోనేటి వెంకట రమణ బాబు, సోమశేఖర్, నాగేంద్రప్రసాద్, హిందూ చైతన్యవేదిక అధ్యక్షుడు విశ్వేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాయినగర్ మసీదులో..

కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ సాయినగర్‌లోని మసీదులో శాంతి నిరసన జరిగింది. కార్యక్రమంలో మసీదు ముతవల్లి కరీముల్లా, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గౌసుమొద్దీన్, నూరుల్లా, సాధిక్‌వలి, తాజుద్దీన్, జావేద్‌తో పాటూ వందల మంది ముస్లింలు పాల్గొన్నారు.

బచ్‌పన్ ప్లే స్కూల్‌లో..

అనంతపురం కార్పొరేషన్: పహల్గాం ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి రాంనగర్‌లోని బచ్‌పన్ ప్లే స్కూల్‌లో ఉపాధ్యాయులు నివాళులర్పించారు. ఉగ్రవాదాన్ని తరిమికొడదామని నినదించారు. మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలన్నారు.

శ్రీ విజయనగర న్యాయ కళాశాలలో..

అనంతపురం: పహల్గాంలో ఉగ్రవాదుల చేతిలో మృతి చెందిన వారికి శ్రీవిజయనగర న్యాయ కళాశాలలో శుక్రవారం నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ హెచ్.రాఘవేంద్రచార్ మాట్లాడుతూ.. జమ్మూకాశ్మీర్ పహల్గాం పర్యాటక ప్రాంతంలో ఉగ్రవాదులు దేశ పౌరులతో పాటు ఇటలీ, ఇజ్రాయిల్ పౌరులను విచక్షణా రహితంగా కాల్చి చంపడం పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రజలు మరణించడం చాలా బాధాకరమన్నారు. ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి కేంద్రం ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.మహేష్ న్యాయవాదులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ భ్రమరాంబ దేవి

అనంతపురం మెడికల్: జిల్లాలో దోమల నివారణకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా దినాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి తెలుగుతల్లి విగ్రహం వరకు తిరిగి డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి చేరుకుంది. అనంతరం డీఎంహెచ్‌ఓ కార్యాలయం ముందు మానహారంగా ఏర్పడి దోమకాటు నివారణ చర్యలకు సంబంధించి సిబ్బంది పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి మాట్లాడుతూ.. జిల్లాలో దోమకాటు నివారణ చర్యల్లో భాగంగా ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా చూస్తున్నామన్నారు. నగరపాలక సంస్థ, మునిసిపాలిటీలు, పంచాయతీల సమన్వయంతో ఫాగింగ్, స్ప్రేయింగ్ చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలు సైతం ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ నారాయణస్వామి, ఓబులు, ఆరోగ్యశాఖ సిబ్బంది సత్యనారాయణ, త్యాగరాజు, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన

అనంతపురం రూరల్: విద్యార్థులు సామాజిక బాధ్యత కలిగి ఉండి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పీవీకేకే కళాశాల చైర్మన్ పల్లె వెంకటకృష్ణ కిశోర్ అన్నారు. శుక్రవారం బాలాజీ ఫార్మసీ కళాశాలలో మలేరియా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు పలు గ్రామాల్లో మలేరియాపై అవగాహన సదస్సులు నిర్వహించారు. అనంతరం కళాశాలలో మలేరియాపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీధర్, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరం

అనంతపురం: ఏపీ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రతిభ ఉన్న యువ క్రికెటర్లను గుర్తించి ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ఏప్రిల్ 26 నుంచి ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఏపీడబ్ల్యూజేయూ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ చైర్మన్ మచ్చా రామలింగా రెడ్డి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అనంతపురం రూరల్ మండలంలోని కొడిమి జర్నలిస్ట్ కాలనీలో మచ్చా క్రికెట్ అకాడమీలో ఉచిత శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 10 నుంచి 25 సంవత్సరాల్లోపు వారు శిక్షణలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. క్రికెట్ సామగ్రి ఉచితంగా అందజేస్తామన్నారు. క్రికెట్ నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్న వారు ఆధార్ కార్డు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 9490062555 నంబర్‌కు కాల్ చేసి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు.

బాలికల భద్రతకు పటిష్ట చర్యలు



మాట్లాడుతున్న నాగమణి

అనంతపురం సెంట్రల్: యుక్త వయస్సు బాలికల భద్రతకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోందని ఐసీడీఎస్ పీడీ నాగమణి తెలిపారు. నగరంలోని ఓ ప్రైవేటు సెమినార్ హాల్‌లో ఉమ్మడి జిల్లాలోని ఐసీడీఎస్ నోడల్ ఆఫీసర్లు, యూనిసెఫ్ ప్రతినిధులతో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు అధికారులు మాట్లాడారు. యుక్త వయస్సు బాలికల సాధికారిత కోసం ప్రత్యేక క్యాలెండర్‌ను విడుదల చేస్తూ ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. బాల్య వివాహాలు నివారించడానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్దామని పిలుపునిచ్చారు. బేటీ బచావో .. బేటీ పడావో కార్యక్రమంతో పాటు ట్రాఫికింగ్‌పై గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి, డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు, సీఐ వెంకటేశ్వర్లు, శ్రీసత్యసాయి జిల్లా ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, అన్నమయ్య జిల్లా డీఎల్‌డీఓ అమర్నాథ్‌రెడ్డి, ఎస్ఎస్ఏ పీఓ శైలజ, యూనిసెఫ్ ప్రతినిధి మేరీజోన్స్ పాల్గొన్నారు.